నేడు బీజేపీ కార్యాలయం ప్రారంభం

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 21న (నేడు) సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని వారాసిగూడ ఎంజీఎం బేకరీ పక్కన కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభించిన అనంతరం, సీతాఫల్‌మండి డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల పరిచయ కార్యక్రమం..

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 21న (నేడు) పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్ మారోజు రామాచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అభ్యాసక సహాయ కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్స్, మోడల్ పేపర్లు, యూనివర్సిటీ యూ ట్యూబ్, వెబ్ రేడియోతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

లాలాపేటలో బుర్రకథ రత్నం వర్ధంతి..

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో బుర్రకథ సామ్రాట్ రత్నం ఏడో వర్ధంతిని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యాదగిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారులకు స్మారక పురస్కారం–2024ను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

మూడు నామినేషన్లు దాఖలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి శనివారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో జై స్వరాజ్ పార్టీ నుంచి ఆర్‌ఎస్ జాన్‌థామస్, స్వతంత్ర అభ్యర్థులుగా సిద్ధిఖీ అహ్మద్‌ఖాన్, మహ్మద్ అబ్దుల్ అజీం తమ నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్‌కు అందజేశారు.

ఉప ఎన్నికకు ఒకటి..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో శనివారం తొలి నామినేషన్ దాఖలైంది. జనగాం జిల్లా తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన దండెం రత్నం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

శ్రీవారి సేవలో తలసాని కుటుంబం

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని శనివారం తెల్లవారుజామున సుప్రభాత సేవ సమయంలో దర్శించుకున్నారు. అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు.

ముగిసిన 'టెక్నోస్మానియా-2024'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ టెక్నాలజీ కాలేజీలో మూడు రోజులుగా కొనసాగిన 'టెక్నోస్మానియా–2024' శనివారం ముగిసింది. కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ప్రిన్సిపాల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ఎండీ రాజమౌళి, హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ సంజయ్ ఠాకూర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు డ్యాన్స్‌లతో హోరెత్తించారు. కార్యక్రమంలో టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొ.శ్రీనునాయక్, అధ్యాపకులు ప్రొ.రమేశ్‌కుమార్, ప్రొ.వీవీ బసవరావు, ప్రొ.రాజం, పరుశురామ్, పరమేశ్వర్లు, డా.సాదం.ఐలయ్య, డా.వి భాస్కర్, డా.అనిత, డా.కవిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు...

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పరస్పర ఆధారిత భౌతిక, గణిత శాస్త్రాల్లో ఇటీవలి పురోగతులు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. చివరిరోజు ప్రిన్సిపాల్ డా.సుకన్య అధ్యక్షత వహించగా కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జేడీ డా.యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజేంద ర్‌సింగ్ ఓయూ సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, ప్రొ.ప్రసాద్, అనితా అబ్రహం, సదస్సు కన్వీనర్లు డా.చిన్నబాబు, డా.మల్లీశ్వరి, సహ కన్వీనర్లు విజయ నిర్మల, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

సనత్‌నగర్: నాట్యశిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్యం, సంగీతంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వాసుకీ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయం పైఅంతస్తు హాల్‌లో ఈ నెల 25వ తేదీ నుంచి 40 రోజుల పాటు కూచిపూడి, ఆంధ్రానాట్యం, శివ తాండవం, శాస్త్రీయ నత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, మరిన్ని వివరాలకు 98493 55145, 8008825651, 8008824482 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ద్రావిడ వర్సిటీ వీసీకి ఉగాది పురస్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: ద్రావిడ యూనివర్సిటీ వీసీ ప్రొ. కొలకలూరి మధుజ్యోతి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 19న (శుక్రవారం) శ్రీత్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేర రావు ఎస్‌వీ వర్సిటీ మాజీ వీసీ పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, సంఘ సేవకులు పబ్బ వైంకుతం చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

సందడిగా 'రోటరీ యూత్ లీడర్‌షిప్'

సనత్‌నగర్: బేగంపేటలోని ఫ్యామిలీ వరల్డ్‌లో శనివారం నిర్వహించిన రోటరీ యూత్ లీడర్‌షిప్ కార్యక్రమం సందడిగా సాగింది. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, శ్రీశక్తి కాలేజ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఐహెచ్‌ఎం శ్రీశక్తి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలు, ఉద్యోగ నైపుణ్యాలపై వక్తలు ప్రసంగించారు. విద్యార్థుల్లో ఉన్నతమైన వ్యవహారశైలి, యోగా ప్రాముఖ్యతను ధ్యాన్ ఫౌండేషన్ ప్రతినిధులు వివరించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ జ్యోతిరెడ్డి, రాజగోపాల్, మూర్తి వడపల్లి, శ్యాం పాటిబండ్ల, రాంప్రసాద్, సురేశ్‌గుప్తా, ఇండియా టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్, యాస్టర్నో ఓవర్సీస్ కన్సల్టెన్సీ వంశీ, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పింజల, ప్రధానోపాధ్యాయులు అనితాచంద్రన్, అనీష్ బెనర్జీ పాల్గొన్నారు.

'రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ఖాళీ'

సనత్‌నగర్: రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ జోస్యం చెప్పారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో అశోక్‌కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ యువకులు ఆమె సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి

ఐకోమస్ దక్షిణ ప్రాంత ప్రతినిధి ప్రొఫెసర్ సత్యనారాయణ మూర్తి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూర్యనారాయణమూర్తి

బన్సీలాల్‌పేట్: పురాతన, చారిత్రక కట్టడాలను పరిరక్షించి వాటిని భావితరాలకు అందించాలని ఐకోమస్ దక్షిణ ప్రాంత ప్రతినిధి ప్రొఫెసర్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ మెట్లబావి వద్ద స్పీక్ అప్, స్టాండ్ అప్, సేవ్ కల్చరల్ హెరిటేజ్ అనే నినాదంతో 'ద వాయిస్ ఆఫ్ హెరిటేజ్ బాడ్జ్ 2024' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూర్వీకులు అందజేసిన చారిత్రాత్మక, పురాతన కట్టడాలను కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఎంతో పురాతనమైన బన్సీలాల్‌పేట్ మెట్ల బావిని 11 నెలల్లోనే పునరుద్ధరించి మంచి చారిత్రాత్మకమైన ప్రదేశంగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెయిన్ వాటర్ కన్సర్వేటివ్ సంస్థలు ఎంతో కష్టపడి కో నేరు మెట్ల బావిని పునరుద్ధరించి అభివృద్ధి చేశారని వివరించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలల విద్యార్థులకు మెట్ల బావి చరిత్ర, పునరుద్ధరణ వివరాలు తెలియజేశారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ఎం. వేదకుమార్, కన్సర్వేటివ్ ఆర్కిటెక్ట్‌లు డాక్టర్ వసంత శోభ, ఇందిర పాల్గొన్నారు.

నూతన చికిత్స విధానాలు తెలుసుకోవాలి


సదస్సులో పాల్గొన్న డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: రుమటాలజీ వ్యాధులపై రుమటాలజిస్టులు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కొత్త రకాల చికిత్స పద్ధతులను తెలుసుకుంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో రెండు రోజుల పాటు జరిగిన రుమటాలజీ జాతీయ సదస్సు–2024 శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థరైటీస్, ఆస్టియో ఆర్థరైటీస్, లూపస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, తదితర రుమటాలజీ సమస్యలపై వైద్యులు చర్చిస్తూ ఇలాంటి విజ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం ఉత్తమ సేవలు అందించవచ్చన్నారు. సదస్సులో రుమటాయిడ్ ఆర్థరైటీస్, యాంకైల్ జింగ్ స్పాండిలైటీస్, సోరియాటిక్ ఆర్థరైటీస్, గౌట్, వాస్కులైటీస్, బాల్య ఆర్థరైటీస్, అరుదైన రుమటాయిటిక్ కండీషన్ల వంటి అంశాలపై చర్చించారు. ట్రైనీల కోసం రుమటాలజీ క్విజ్‌ను నిర్వహించారు. భారతదేశంలో రుమటాలజీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు క్లినికల్ రుమటాలజీ కాన్ఫరెన్స్–2024 ఒక ప్రముఖ వేదికగా నిలిచిందని ప్రముఖ వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మినుబాజ్‌పాయి, ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, పాండిచ్చేరి జిప్‌మర్ రుమటాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మెలీ థాబా, సికింద్రాబాద్ కిమ్స్ రుమటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు



సనత్‌నగర్: గంజాయి తరలిస్తున్న యువకుడిని సనత్‌గర్ పోలీసుల సహకారంతో ఎస్‌ఓటీ బాలానగర్ టీం పట్టుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన బచ్చల లోకేశ్ (21) జీవనోపాధి కోసం మోతీనగర్‌కు వలస వచ్చి సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. అయితే గంజాయికి ఎక్కువగా డిమాండ్ ఉందన్న విషయం తెలుసుకుని వాటిని విక్రయించి డబ్బులు సంపాదించాలని అనుకున్నాడు. ఈ క్రమంలో శ్రీకాకుళం ఇచ్ఛాపురం నుంచి గంజాయి సరఫరా చేస్తున్న సోంపేటకు చెందిన నరేశ్ వద్ద కొనుగోలు చేసి నగరానికి వచ్చాడు. ఇక్కడి కూలీలు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన యువకులకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ బాలానగర్ టీమ్, సనత్‌నగర్ పోలీసులు భరత్‌నగర్ బ్రిడ్జి వద్ద లోకేశ్‌ను పట్టుకుని నిందితుడి నుంచి రూ.57,500 విలువైన 2.3 కిలోల గంజాయితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. లోకేశ్‌కు గంజాయి సరఫరా చేసిన నరేశ్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థలో సీఎంఏ పాత్ర కీలకం

ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్‌కుమార్

సనత్‌నగర్: ధృఢమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఎంఏ) పాత్ర ఎనలేనిదని ఐసీఎంఏఐ అధ్యక్షుడు సీఎంఏ అశ్విన్‌కుమార్ జీ దళవాడి అన్నారు. అమీర్‌పేటలోని ఆదిత్యాపార్క్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, కార్పొరేట్ ప్రపంచానికి సీఎంలు బలమైన శక్తిగా ఉన్నారన్నారు. కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర పూర్తిగా రూపాంతరం చెందిందని వ్యాపార కార్యకలాపాల్లో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తున్నారని చెప్పారు. సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు, కార్పొరేట్ అనుకూల విధానాలు, పథకాలను సూచించడానికి వీలు కల్పిస్తుందన్నారు. సీఎంఏలు తమ కార్యకలాపాలు, అంతర్గత నియంత్రణ, పాలనా ప్రక్రియలు, రిస్క్ మేనేజ్‌మెంట్, నియంత్రణ వ్యవస్థల సమర్థత ఆయా సంస్థలకు సహాయం చేస్తున్నాయన్నారు. ఖర్చులు, ధరలు, ఆర్థిక, పన్ను విధానాలు రూపొందించడం, పర్యవేక్షించడంతో పాటు సలహా ఇవ్వడంలో ప్రభుత్వానికి సహాయం చేస్తున్నాయని చెప్పారు. ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్ తదితర క్లాస్–1 సేవలతో సమానంగా 1978లో కేంద్ర ప్రభుత్వం ఇండియన్ కాస్ట్ అకౌంట్స్ సర్వీసును ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. వ్యాపార సంస్థలకు వృత్తిపరమైన శిక్షణ, నిపుణుల ఇన్‌పుట్‌లు అందించనున్నామని వివరించారు. ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్‌కు మద్దతు ఇవ్వడంలో సీఎంఏలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 5 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధనకు ఇవన్నీ అవసరమన్నారు. మార్కెట్ రిస్క్, క్రెడిట్ రిస్క్, ఆపరేషనల్ రిస్క్ వంటి సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను సీఎంఏలు అంచనా వేస్తాయన్నారు. కర్మాగారాల్లో కాస్ట్ అకౌంటెంట్ల నుంచి బోర్డ్‌రూమ్‌ల్లో మేనేజ్‌మెంట్ అకౌంటెంట్‌లకు మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎంఏ డాక్టర్ కేసీహెచ్‌ఏవీఎస్‌ఎన్ మూర్తి, ఐసీఎంఏఐ చైర్‌పర్సన్ హైదరాబాద్ చాప్టర్ సీఎంఏ హిమ విద్యా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెజిమెంటల్‌లోని పద్మ రెసిడెన్సీ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని సమాచారం మేరకు పోలీసులు 108 కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి సంబంధించిన వాళ్లు ఉంటే గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

బాలిక అదృశ్యం



రాంగోపాల్‌పేట్: బాలిక అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన శ్రీను కుమార్తె సాయిసీత (12) స్థానిక బాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. ఈ నెల 19వ తేదీన మక్తల్‌లో ఉండే అమ్మమ్మ దగ్గర నుంచి బోరబండకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కి ఎంజీబీఎస్‌లో దిగింది. అక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు సిటీ బస్సులో వస్తున్నట్లు తండ్రితో ఫోన్లో మాట్లాడింది. అనంతరం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉండే ఎనిమిదో నంబర్ బస్టాప్ వద్ద ఆమె అదృశ్యమయ్యింది. తర్వాత తండ్రి ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో ఆయన శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు ఎస్సై వేణుగోపాల్ 8712660248, పోలీస్‌స్టేషన్ 8712661249 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఆత్మహత్యకు ముందు సెల్ఫీ..

- అధిక వడ్డీలు, డబ్బుల కోసం వేధింపులే కారణమని ఆవేదన
- వీడియోలో పలువురి పేర్ల ప్రస్తావన

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌ఆర్‌టీ కాలనీకి చెందిన రాకేశ్ కిరణ్ (37) శుక్రవారం రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అయితే అధిక వడ్డీల వసూలుతో పాటు డబ్బుల కోసం వేధిస్తుండడమే ఆత్మహత్యకు కారణమని ఆయన తీసుకున్న సెల్ఫీ వీడియో శనివారం వెలుగులోకి వచ్చింది. సూసైడ్‌కు ఒక రోజు ముందు రాకేశ్ కిరణ్ సనత్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై నడుస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఇందులో శివ, మహేశ్, అల్కేశ్, రోషన్ పేర్లను ప్రస్తావిస్తూ తన వద్ద రూ.10, రూ.15, రూ.20ల చొప్పున వడ్డీలు వసూలు చేశారని, డబ్బుల కోసం వేధించడం బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంట్లో బంగారం పెట్టి మా డబ్బులు ఇవ్వు..అంటూ ఒత్తిడి తీసుకురావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మొదట రైలు పట్టాల సమీపంలోకి ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లి ధైర్యం చాలక తిరిగి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు. శనివారం సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ రాకేశ్ కిరణ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. అధిక వడ్డీలతో రుణాలు ఇచ్చిన వారు వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

రసూల్‌పురా: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మహిళను కార్ఖాన పోలీసులు పట్టుకుని 2 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్న వ్యాపారి అల్వాల్‌కు చెందిన తాళ్ల కౌశిక్‌ను సైతం అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం అందిన సమాచారం మేరకు బీఆర్‌వో జంక్షన్‌లో ఆటో (టీఎస్13 యూబీవో 251) లో రేషన్ బియ్యం తరలిస్తున్న యాదాద్రి జిల్లా బొమ్మల రామారం బోటిమీడి తండాకు చెందిన వద్యా లక్ష్మి (40) ని అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమెను విచారించగా బస్తీల్లో తిరుగుతూ రూ. 8 కిలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అల్వాల్ జొన్న బండ సాయినగర్‌కు చెందిన బియ్యం వ్యాపారి కౌశిక్‌కు రూ. 16 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపింది. సీఐ రామకృష్ణ నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ముప్పిడి మధుకర్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత ముప్పిడి మధుకర్ కాంగ్రెస్ తీర్థం తీసుకున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి సమక్షంలో తన ప్రధాన అనుచరులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో చేరగా వారికి సీఎం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2019 ఎంపీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రచార బాధ్యతల్లో కీలకంగా వ్యవహరించిన ముప్పిడి మధుకర్ కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరంగా ఉందని సీఎం అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేయాలని సీఎం ముప్పిడికి సూచించారు. 30 ఏళ్లుగా దివంగత ఎమ్మెల్యే సాయన్నకు ప్రధాన అనుచరుల్లో ఒకరైన మధుకర్ కొన్నేళ్లుగా ఆయనకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వర్గంలో కీలక వ్యక్తిగా కొనసాగుతున్న ఆయన కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. మధూకర్‌తో పాటు భాస్కర్ ముదిరాజ్, భాస్కర్, సతీశ్, సిద్ధాంత్, నర్సింగ్, భరత్ తదితరులులు చేరారు.

కాంగ్రెస్‌లోకి 'కూన' కుటుంబం..?

- దాదాపుగా ఖరారు..!
- త్వరలో సీఎం రేవంత్ సమక్షంలో చేరిక

సనత్‌నగర్: రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు కూన వెంకటేశ్‌గౌడ్ కుటుంబం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నేతలతో ఆయన తనయులు శ్రావణ్‌కుమార్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్ ఇద్దరూ భేటీ అయినట్లు సమాచారం. ఈ క్రమంలో వారు చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. కూన వెంకటేశ్‌గౌడ్ మొదటిసారిగా 2009లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తర్వాత 2014 లో టీడీపీ తరుపున సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యేగా బరిలోకి దిగారు. అనంతరం 2018లో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. అయితే అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా కొంతకాలంగా వెంకటేశ్‌గౌడ్ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో రాజకీయంగా ఆయనకు చేదోడువాదోడుగా ఉంటున్న ఇద్దరు కుమారులు ఇక మీదట క్రియాశీలక రాజకీయాల్లోకి రానున్నారు. ఈ క్రమంలోనే కుమారులిద్దరూ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంతో సమావేశం కాగా చేరేందుకు అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో నిలవగా, ఇప్పుడు కూన కుటుంబం చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన అవసరం

సనత్‌నగర్: గ్యాస్ ప్రమాదాలపై గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు అవగాహన కల్పించాలని సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా బల్కంపేటలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు ఆందోళన చెందకుండా వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపి వేయాలన్నారు. ఎలక్ట్రిక్ స్విచ్‌లు ఆన్ చేయవద్దని, అలాగే దీపాలు, అగరబత్తిలను ఆర్పి వేయాలన్నారు. గాలి, వెలుతురు కోసం అన్ని కిటికీలు, దర్వాజాలను తెరవాలని సూచించారు. గ్యాస్ లీక్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేయడమో లేకుంటే తడిపిన గోనె సంచి, తడి బట్టను మండుతున్న సిలిండర్‌పై వేసి వెంటనే ఖాళీ స్థలంలోకి తీసుకువచ్చి వదిలేయాలన్నారు. కాగా నిప్పును ఆర్పే యంత్రాల పనితీరుపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాలుగు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం అని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితతో కలిసి శనివారం బోయిన్‌పల్లిలో ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గానికి చేసిన సేవలను స్థానికులు మరిచిపోలేరన్నారు. ఆయన వారసురాలిగా ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న నివేదితను ప్రజలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పికెట్‌లో ప్రచారం..

మాజీ బోర్డు సభ్యురాలు నళిని కిరణ్‌తో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత నాలుగో వార్డు పరిధిలోని ముదిరాజ్ బస్తీ, యాదవ్ బస్తీ, దోబీ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. తనను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని వెల్లడించారు. స్థానిక బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వినోద్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, రామ్మోహన్, సంతోష్, గణేశ్, ఆనంద్, హ్యాపీ టీమ్ సభ్యులు, మహేశ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో అమర్‌నాథ్ యాత్రికులకు సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

గాంధీఆస్పత్రి: అమరనాథ్ యాత్రకు అవసరమైన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో శనివారం ప్రారంభమైంది. ఆస్పత్రి ప్రధాన భవనం మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డు డిపార్ట్‌మెంట్ (ఎంఆర్‌డీ)లో నలుగురు వైద్యనిపుణులతో కూడిన మెడికల్ బోర్డు 120 మంది యాత్రికులకు సర్టిఫికెట్లు జారీ చేశారు. ప్రభుత్వం నియమించిన మెడికల్ బోర్డు నేతృత్వంలో ప్రతి బుధ, శనివారాల్లో పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అమరనాథ్ యాత్ర ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని మడ్‌ఫోర్ట్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ జి.షద్రక్ పేర్కొన్నారు. మడ్‌ఫోర్ట్ హట్స్, కొంరయ్య హట్స్, లంబాడా బస్తీల్లో షద్రక్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా యూనిఫాం, టెక్ట్స్, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, ఎన్‌సీసీ, క్రీడలతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా డిజిటల్ తరగతులు, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, విజ్ఞాన సదస్సులు ఇతర అంశాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి


బాపూజీనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్‌లోని ఒకటో వార్డు బాపూజీనగర్‌లో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రూ.48 కోట్ల టీపీటీ బకాయిల విడుదల, ఎలివేటెడ్ కారిడార్ పనుల ప్రారంభోత్సవం వంటివి ఇందుకు ఉదాహరణ అని అన్నారు. రానున్న రోజుల్లో ఎయిర్ పోర్టు, రక్షణ భూముల పరిధిలోని బస్తీ వాసులకు భూబదలాయింపు ద్వారా పట్టాలు అందజేసే అవకాశం కూడా ఉందన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా తాను గెలిచిన వెంటనే ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. భూబదలాయింపు ప్రక్రియ పూర్తయితే కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో ఓట్లు కోల్పోయిన 45వేల మంది ఓట్ల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉంటుందన్నారు.